ప్రజాశక్తి
సోమవారం 2 జూన్ 2025



స్వీపింగ్ మిషన్ ప్రారంభం

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్ :రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరకే నిత్యావసర సరుకులను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పట్టణ అభివద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా స్వచ్ఛ నెల్లూరు లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. నెల్లూరులోని జనార్ధన్‌రెడ్డి కాలనీలో 3డి మీటర్ స్వీపింగ్ మిషన్లను నగర కమిషనర్ నందన్, జెసి కార్తీక్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులతో కలిసి మంత్రి ప్రారంభించారు. రూ. 1.30 కోట్లతో ఐదు స్వీపింగ్ మిషన్లు స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్‌కి అప్పగించారు. స్వీపింగ్ మిషన్ వాహనాన్ని స్వయంగా నడిపి పనితీరును గమనించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాభిప్రాయం మేరకే రేషన్ వాహనాలను రద్దు చేశామన్నారు. గతంలో మాదిరిగా రేషన్ దుకాణాల ద్వారా బియ్యం ఇస్తారన్నారు. వృద్ధులు, వికలాంగులకు ఇళ్ల వద్ద ఇస్తారన్నారు. మరికొన్ని నిత్యవసరాలను తక్కువ ధరకే ఇస్తామన్నారు.

'రేషన్' షాపుల వద్ద పడిగాపులు..!

రేషన్ దుకాణాలు వద్దే బియ్యం.. సరుకులు పంపిణీ చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆదివారం జిల్లా వ్యాపితంగా ప్రజా ప్రతినిధులు , అధికారులు , టిడిపి, జనసేన, బిజెపి నేతలు రేషన్‌షాపుల పున :ప్రారంభం పేరుతో హంగమా చేశారు. మంత్రులు, ఎంపి, ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా వ్యాపితంగా కొన్ని చోట్ల సర్వర్లు మురాయిం చినట్లు సమాచారం. ఆలస్యం కావడంతో రేషన్‌కార్డుల వినియోగదారులు అక్కడక్కడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యను ఏకిపారేసినట్లు తెలిసింది. ప్రభుత్వం మళ్లీ పాత పద్ధతిని తీసుకురావడంతో మహిళలు, వృద్ధులు ఎక్కువ మంది షాపుల వద్ద క్యూ కట్టడం కనిపించింది. ఎక్కడా ఎవరినీ ఆపకుండా మ్యాన్‌వల్‌గా బియ్యం సరఫరా చేశారు. తొలిరోజు కావడంతో జిల్లాలో రికార్డు స్థాయిలో బియ్యం పంపిణీ చేశారు. జిల్లా వ్యాపితంగా ఉన్న 7.21 లక్షల రేషన్‌కార్డుల్లో ఆదివారం సాయంత్రం 6 గంటలకే 57,458 మంది కార్డుదారులకు రేషన్ అందిం చినట్లు డిఎస్‌ఒ ఎన్. విజయకుమార్ తెలిపారు.

- కొన్ని చోట్ల సర్వర్లు మొరాయింపు
- అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడి
- తొలి రోజు రికార్డు స్థాయిలో పంపిణీ
- కార్డుదారుల్లో ఆగ్రహావేశాలు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరా శాఖ పాత పద్ధతిలో రేషన్ కార్డు దారులకు బియ్యం , సరుకులు పంపిణీ చేసింది. జిల్లా వ్యాపితంగా 38 మండలాల పరిధిలో 1513 రేషన్ షాపులు ఉన్నాయి.. ఉదయం 8 గంటలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నేతలు అక్కడక్కడా దగ్గరుండి తమ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాన్ని కార్డుదారులకు వివరించారు. ఇప్పటి వరకు రేషన్ వాహనాల ద్వారా సరుకులు తీసుకున్న జనం ఒక్కసారిగా షాపుల వద్దకు రావడంతో కొంత అసహనం వ్యక్తం చేశారు. తొలుత కొన్నిచోట్ల సర్వేర్లు సక్రమంగా పనిచేయలేదు. రాపూరు, సీతారామపురం, కొండాపురం వంటి ప్రాంతాలతోపాటు, నగరంలోని మూలపేట,గాంధీనగర్, డైకాస్‌రోడ్డు ప్రాంతాల్లో కొంత ఇబ్బంది వచ్చినట్లు తెలిసింది. ప్రధానంగా మహిళలు పెద్ద ఎత్తున రేషన్ షాపు వద్ద కనిపించారు. కొన్నిచోట్ల గంటల తరబడి క్యూల్లోనే ఉన్నారు. 2019కు ముందు రేషన్‌కార్డు దారులు షాపుల వద్దకు వెళ్లి బియ్యం,చక్కెర, కందిపప్పు, నూనె, వంటి నిత్యవసర సరుకులు తెచ్చుకునేవారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటింటికి రేషన్ పథకం తీసుకొచ్చారు. ప్రస్తుతం పాత పద్ధతి తీసుకరావడంతో మహిళలు, వృద్ధులు, పురుషులు క్యూలో కనిపించారు. అనేక చోట్ల ప్రభుత్వ విధానాలపై జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటికి వచ్చి ఇచ్చే వాహనాలు ఎందుకు తీయాల్సి వచ్చిందని ప్రశ్నించారు.కొన్ని చోట్ల రేషన్ దుకాణాలు అడ్రసులు మారాయి. ఈ విషయం తెలియక అనేక మంది షాపులు ఎక్కడున్నాయో తెలుసుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం కొత్తగా రేషన్ షాపుల వద్దే సరుకులు ఇవ్వడంతో అదేదో కొత్త పథకంగా చెప్పుకుంటూ అధికారపార్టీ మౌనంగా సరుకులు తీసుకొని వెళ్లారు. బియ్యం, చక్కెర, జొన్నలు మాత్రమే సరఫరా చేశారు. అనేక మంది ఇంటి దగ్గర పనులు మానుకొని, కూలీ పనులు నిలిపేసి వచ్చామంటూ గగ్గోలు పెట్టారు. ఇంట్లో ఉంటే వృద్ధులు ఎక్కువ మంది రేషన్ షాపు వద్ద కనిపించారు. భారంగా బియ్యం సైకిల్ పైనా, నెత్తిన పెట్టుకుని తీసుకెళ్లారు.

మంత్రి, ఎంఎల్‌ఎల ఆధ్వర్యంలో..

రేషన్ షాపుల వద్దే సరుకులు మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, టిడిపి నేతలు సరఫరా చేశారు. నెల్లూరు నగరంలో మంత్రి పి. నారాయణ, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం నగరంలోని ఓ దుకాణాన్ని పరిశీలించి బియ్యం , సరుకులు పంపిణి చేశారు. నెల్లూరు రూరల్ నియోకవర్గ పరిధిలోని దేవరపాళెం ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీన్ , టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బియ్యం షాపును పరిశీలించి, సరుకులు పంపిణి చేశారు. కావలి నియోకవర్గంలో ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి తమ పార్టీ నేతలతో వెళ్లి సరుకులు పంపిణి చేశారు. సర్వేపల్లిలో టిడిపి యువనాయకులు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి షాపును ప్రారంభించి, స్వయంగా సరుకులు పంపిణి చేశారు.. ప్రతినెల ఒకటో తేది నుంచి 15 వతేది వరకు షాపుల్లో సరుకులు ఇస్తారు. జిల్లా వ్యాపితంగా 1513 షాపులు న్నాయి. జిల్లాలో 7,21,524 కార్డులున్నాయి. తొలిరోజు కావడంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పెద్దఎత్తున జనం రావడంతో రేషన్‌షాపుల వద్ద రద్దీ ఏర్పడింది. 15 వరకు సమయం ఉన్నప్పటికీ ఎక్కువ మంది ఆదివారం సరుకులు తీసుకున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ప్రతి నెల ఒకటో తేది సరుకులు ఎలా సరఫరా చేస్తారనే రికార్డు తీశారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేది రాత్రి 10 గంటల సమయం వరకు 45,397 మంది రేషన్‌కార్డు దారులు సరుకులు తీసుకున్నారు. మే 1న 43,310 మంది సరుకులు తీసుకొగ, ఆదివారం సాయంత్రం 6 గంటలకే జిల్లా వ్యాపితంగా 57,458 మంది కార్డుదారులు సరుకులు తీసుకున్నట్లు డిఎస్‌ఒ ఎన్., విజయ్‌కుమార్ తెలిపారు. అక్కడక్కడా ఇబ్బందులున్నా ఎవ్వరికీ సరుకులు ఆగలేదని, టెక్నికల్ సమస్య వచ్చినచోట విఆర్‌ఒ ఫోటో తీసుకొని, సంతకం చేయించి మ్యానివల్‌గా అందించామని తెలిపారు. ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు సరుకులు పంపిణి చేశారు. ప్రజలు పాత విధానానికి అలవాటు పడడానికి కొంత సమయం పడనుంది. ప్రభుత్వ విధానాన్ని మాత్రం ఎక్కువ మంది కార్డుదారులు వ్యతిరేకించడం కనిపించింది.

నెల్లూరులో రేషన్ పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

సిఫార్సులకే 'బదిలీ'..!

ప్రభుత్వ ఉద్యోగులు బదిలీ ప్రక్రియ వాయిదా పడినట్లు తెలిసింది. నేటితో రాష్ట్ర పభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ ముగియనుంది. అనేకచోట్ల ఇందుకోసం ప్రక్రియ కొనసాగుతుం డడంతో ప్రభుత్వం ఈనెల 9వ తేదీ వరకు పొడిగించినట్లు సమాచారం అందుతోంది. జిఒ విడుదల కావాల్సి ఉంది. ఇప్పటికే బదిలీల కోసం ఉద్యోగులు, సిబ్బంది సిఫార్సుల లేఖలు తీసుకొని కలెక్టరేట్ వద్ద తిరుగుతున్నారు. కొందరు ఎంఎల్‌ఎలు నేరుగా సిఫార్సుల లేఖలు అందజేశారు. మరికొందరు వ్యక్తిగతంగానూ సిఫార్సుల లేఖలు దక్కించుకున్నారు. ఆయా నియోజ వర్గాల్లో ఎంఎల్‌ఎలు సిఫార్సులకే ప్రాదాన్య కల్పిస్తున్నారు. దీంతో అధికార పార్టీ నేతలకు గులాం..సలాం గిరి చేస్తున్నారనే సిఫార్సులు దక్కాయి. స్థానిక నేతలు కొందరు చేతివాటం ప్రదర్శించి లేఖలు ఇప్పించినట్లు సమాచారం.

- 9 వ తేదీ వరకు పోడింపు
- ఉద్యోగ సంఘాల్లో బడాయి..లడాయి..
- ఎంఎల్‌ఎల సిఫార్సుకే ప్రాధాన్యత

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వ ఉద్యోగులు బదిలీ కోసం అదికారపార్టీ నేతలు, చోట నాయకులు, ప్రజా ప్రతినిధులు చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బదిలీలు పూర్తి చేసింది. తాజాగా గత నెల 15 నుంచి జూన్ 2 వతేది వరకు సాధరణ బదిలీలు నిర్వహించాలని జిఒ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో అనేక నిబంధనలు పెట్టారు. ఎన్ని నిబంధనలున్నా చివరికి స్థానిక ఎంఎల్‌ఎ ఎవరికి సిఫార్సు చేస్తే వారికే బదిలీ ఇవ్వాలనే ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. దీంతో పెద్ద ఎత్తున ఎంఎల్‌ఎ కార్యాలయం నుంచి అధికారులు, సిబ్బంది సిఫార్సుల లేఖలు సంపాదించారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున చేతులు మారినట్లు విమర్శలు వస్తున్నాయి. ఆదాయ వనరులుండే శాఖలలోని ఉద్యోగులు కొంత ఖర్చులు పెట్టి మరీ బదిలీ సిఫార్సులు పొందారని సమాచారం. అధిక వసతులున్న చోట , ఆదాయం వచ్చే ప్రాంతాల్లో పోస్టింగ్‌లు...నగరంలోనూ, లేదా దగ్గరగా ఉద్యోగం చేయడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకే ఎవరినో ఒకరిని పట్టుకొని తమకు అనుకూలమైన చోటకు బదిలీ చేయించుకోడానికి ఉద్యోగలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా మండలాల్లో ఉండే స్థానిక నేతలకే ఎక్కువ గిరాకీ కనిపిస్తుంది. వారి చట్టు, వారి ఇళ్ల చుట్టూ ఉద్యోగులు, సిబ్బంది తిరుగుతున్నారు. ఎంఎల్‌ఎ సిఫార్సు లేఖలు దాదాపు అందిరికీ అందాయి. ఇప్పటికే ఆయా శాఖలు, కలెక్టరేట్‌లో అందజేసినట్లు సమాచారం. . గత ప్రభుత్వంలోనూ, ఇప్పుడు రాష్ట్ర కేంద్రం నుంచి స్దానిక ఎంఎల్‌ఎ సిఫార్సు లేఖల ప్రకారమే బదిలీలు చేయాలనే ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఎంపి,ఎంఎల్‌ఎల లేఖలకు ప్రాధాన్యత పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగులు పరిస్దితి ఎంఎల్‌ఎలకు తెలియకపోయినా స్దానికంగా ఉండే నేతలు సిఫార్సులు చేస్తున్నారు. ఇందులో కొందరు నేతలు జేబులు నింపుకుంటున్నారనే విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల బదిలీలు జరిగాయి. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో గతంలో జరిగిన బదిలీల్లో ఒక్కో ఎంఎల్‌ఎ 500 నుంచి వెయ్యి సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు సమాచారం. సుమారుగా ఆరు వేల లేఖలు అధికారులకు అందినట్లు తెలిసింది. కొందరు ఎంఎల్‌ఎలు ఒక్క పోస్టుకు ఒక్క లేఖ ఇవ్వగా , కొందరు అడిగిన వారందరికీ లేఖలు ఇచ్చి తరువాత తమ మనుషులు పంపి సరఫరేటుగా లేఖలు ఇప్పించారు. కొందరు నేరుగా ఉన్నతాధికారులకు పోన్లు చేసి తమకు అనుకూలమైన వ్యక్తులకు పోస్టిం గ్‌లు ఇప్పించుకున్నారు. తాజాగా అదే పరిస్దితులు కనిపిస్తున్నాయి. నేటితో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ముగియనుంది. అనేక చోట్ల ఇందుకు సంబందించి ఇబ్బందులు ఉండడంతో ప్రభుత్వం ఈనెల 9 వరకు గడుపు పెంచినట్లు తెలుస్తోంది. జిఒ విడుదల కావాల్సి ఉంది.ఇ ప్పటికే సిఫార్సు లేఖలు ఉన్నతాధికారులకు చేరాయి. కొత్తగా చేసేది లేకపోయిన నిబంధనలు పాటించేలా అదికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఉద్యోగ సంఘాల లడాయిలు ..!

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు బదిలీల కోసం గత నెల 15న జిఒ విడుదల చేసింది. 16 నుంచి జూన్ 2 వరకు బదిలీల ప్రక్రియ ముగించాలని ఆదేశాలు జారీ చేసింది. తాజాగా 2023 టిడిపి ప్రభుత్వం ఉద్యోగ సంఘాలకు ప్రాధాన్యత కల్పించింది. 9 సంవత్సరాల పనిచేసినా బదిలీల్లో ఉద్యోగ సంఘాల సిఫార్సు లేఖలు ఇస్తే దానిని ఉన్నతాధికారులు పరిగణంలోని తీసుకోవాల్సి ఉంటుంది ఇది ఇప్పుడు ఉన్నతాధికారులకు తలనొప్పిగా తయారైయింది. ఉద్యోగ సంఘాల్లో రెండు,మూడు గ్రూపులు, తమకు అనుకూలమైనవారికి సిఫార్సు లేఖలు ఇస్తున్నారనే విమర్శలు న్నాయి. కొందరు నేరులు కలెక్టరేట్‌కు వచ్చి తమ సంఘం తరుపున సిఫార్సు లేఖలంటూ అధికారులకు అందిస్తున్నారు. ఇప్పటికే కొంత జాబితా సిద్ధం చేసినా ఇప్పుడు మ ళ్లీ గడుపు పొడిగించడంతో ఏం రుగుతుందో చూడాలి.

'టిఆర్‌ఆర్'లో అడ్మిషన్లు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరుటిఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ షేక్ నాగూరు వలి తెలిపారు. కళాశాలలో తెలుగు , ఇంగ్లీష్ మీడియం కోర్సులు వున్నాయన్నారు. ఒకేషనల్ కోర్సులకి కూడా అడ్మిషన్లు జరుగుచున్నాయని తెలిపారు.జూన్ రెండో తేదీ నుండి కళాశాల పునః ప్రారంభమవుతాయన్నాఉ. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలతోపాటు మెటీరియల్ అందజేయబడుతుందన్నారు. విద్యార్థులకు తల్లికి వందనం పథకం ద్వారా 15 వేల రూపాయలు స్కాలర్షిప్‌గా వస్తుందన్నారు. అలాగే డొక్కా సీతమ్మ భోజన పథకం ద్వారా మధ్యాహ్నభో భోజనం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని షేక్ నాగూర్ వలి తెలిపారు.

ఆలయ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి -కందుకూరు

కందుకూరు ప్రాంత ప్రజల ఇలవేల్పు అంకమ్మ తల్లి అమ్మవారిని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎంఎల్‌ఎ గారు ఆలయంలో జరుగుతున్న అభివద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులకు త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు.ఇటీవల 24 రూములకు వేలంపాట జరగగా, ఆ స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.. ఆలయ ఈవో కార్తీక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, కొడాలి కోటేశ్వం౯రావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

ప్రజాశక్తి -కందుకూరు : నేడు కందుకూరు టౌన్ లోని పామూరు రోడ్ సబ్ స్టేషన్ నుండి వెళ్లే 11 కె.వి శ్రీనగర్ కాలనీ ఫీడర్‌లో లైనుకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ టివి నరసింహం తెలిపారు. ఈ నేపథ్యంలో గుర్రం వారి పాలెం, ఇండియన్ గ్యాస్ గూడెం ఏరియా మరియు ముత్తరాసుపాలెం, వరపర్లవారి పాలెం ఏరియాలో విద్యుత్ ఉండదన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

వృద్ధుడు దారుణ హత్య

ముక్కలు చేసి.. బోరు బావిలో పడేసిన హంతకుడు

ప్రజాశక్తి - లింగసముద్రం

అత్యంత క్రూరంగా వ్యక్తిని దారుణ హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల మేరకు మండల కేంద్రమైన లింగ సముద్రం పంచాయతీ పరిధిలోని జంపాల వారి పాలెం గ్రామానికి చెందిన తోపూరి నరసింహ (60) ఈనెల 30న ఉదయం 10 గంటలకు ఆర్‌ఆర్ పాలెం పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం సమీపంలో ఉన్న తన నిమ్మ తోటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఎంతసేపు అయినా మధ్యాహ్నం భోజనానికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో ఆయన కుమారుడు తోటలోకి వెళ్లి చూడగా తోటలో టివిఎస్ ఎక్సెల్ మాత్రమే ఉంది.తోట మొత్తం వెతికినా నరసిం హంకనిపించలేదు. చుట్టు పక్కల గ్రామాల్లోని బంధువులను విచారించారు. ఎక్కడ కూడా ఆచూకీ కనిపించలేదు. దీంతో నిమ్మ తోటలో పనులు ఉన్నప్పుడు గత కొన్నే నుంచి నరసింహ బ్రహ్మయ్య అనే కూలిని పెట్టి పనులు చేస్తూ ఉండేవాడు. అతని మీద అనుమానం రావడంతో అతన్ని గట్టిగా అడగడం జరిగింది. దీంతో పొంతనలేని సమాధానాలు చెప్పడం వల్ల అతని ఏదో చేశాడని శనివారం పోలీస్ స్టేషన్లో కుమారుడు ఫిర్యాదు చేశారు .పోలీసులు తమదైన శైలిలో విచారించగా నరసింహంను తానే హత్య చేశానని బ్రహ్మయ్య పోలీసులు ఎదుట ఒప్పుకున్నట్లు తెలిసింది. గట్టిగా విచారించడంతో తానే ముక్కలు చేసి బోరుబావిలో వేశానని చెప్పినట్లు సమాచారం. ఘటన స్థలాన్ని కందుకూరు డిఎస్‌పి సుబ్రహ్మణ్యం, గుడ్లూరు సీఐ మంగారావు పరిశీలించి వివరాలు సేకరించాయి. పోలీస్ జాగిలం వచ్చి బోరుబావి పరిసరాలను పరిశీలించింది. అత్యంత అమానుషంగా వ్యక్తిని ముక్కలు చేసి బోరుబావిలో వేశారని విషయం తెలియడంతో ఒక్కసారిగా ప్రజలు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు నిమ్మ తోట వద్దకు చేరుకురని భయాందోళనకు గురయ్యారు. కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

బోరు బావిని పరిశీలిస్తున్న పోలీసులు ఇన్‌సెట్లో మృతుడు నరసింహం

నరసింహం(ఫైల్)

రేషన్ షాపులు పున:ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు

కార్డుదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రేషన్ పంపిణీకి చర్యలు తీసుకున్నామని ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని నాంచారమ్మ కాలనీ, గవర్నమెంట్ హాస్పిటల్ వెనుక వైపు గల నూతన రేషన్ డీలర్ షాపులను సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తో కలసఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు .సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ , ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రభుత్వం ద్వారా వచ్చే నిత్యవసర సరుకులను కార్డుదారులకు పంపిణీ చేశారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పేదలకు రేషన్ బియ్యం సక్రమంగా విమర్శలకు తావు లేకుండా అందించాలని రేషన్ డీలర్లకు తెలిపారు.ఇకపై లబ్ధిదారులు తమ నివాస ప్రాంతానికి దగ్గర్లో ఉన్న ఏ రేషన్ షాప్ నుంచైనా సరుకులు తీసుకోవచ్చు అని రైస్ కార్డు నమోదైన డీలర్ దగ్గరే తీసుకోవాలని నిబంధన ఏమీ లేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.డి.టి చెంచురామయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మాజీ టిడిపి కందుకూరు పట్టణ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ళ రవిచంద్ర, కొత్తూరి వెంకట సుధాకర్, తలమంచి బ్రహ్మయ్య, మహర్షి శీను, షేక్ మున్నా, సవిడిబోయిన వెంకటకష్ణ, చక్కా కేశవ, చుండూరి శ్రీను, జియావుద్దీన్, రూబీ, అత్తంటి శివకష్ణ, అత్తంటి శ్రీలక్ష్మి ఉన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ప్రజలకు అందుబాటులోకి తమ ప్రభుత్వం రేషన్ షాపులు తీసుకొచ్చిందని, ఈ ప్రక్రియను ప్రజలు స్వాగతిస్తున్నారని టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయ కర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తోటపల్లి గూడూరు మండలంలోని నరుకూరు, టీపీ గూడూరులో రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం రేషన్ పంపిణీలో కీలక మార్పు తీసుకొచ్చిందన్నారు. ఈ నేపథ్యంలోనే రేషన్ షాపులను పునఃప్రారంభించిందని తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు, ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ సరుకుల పంపిణీ జరుగుతుందని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. టిడిపి కన్వీనర్ కొణతం రఘుబాబు, రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, సొసైటీ చైర్మన్ సన్నారెడ్డి సురేష్ రెడ్డి, మన్నెం జితేంద్ర గౌడ్, సోమిరెడ్డి రేవంత్ రెడ్డి, సర్పంచ్ ఇంగిలేల వెంకట చైతన్య కుమార్, విశ్వేశ్వరరావు, తాళ్లూరు జీవరత్నం (జీవయ్య), తోటపల్లి రామ్మోహన్ నాయుడు, పాకం వెంకయ్య ఉన్నారు.

కందుకూరులో..

డివైఎఫ్ఐ శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు :కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేసిన హామీ మేరకు మెగా డిఎస్సీ ప్రకటించాలంటూ డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రభుత్వంతో అలుపెరుగని పోరాటం చేసిన ఫలితంగానే నోటిఫికేషన్ విడుదల చేసిందని డివైఎఫ్ఐ సీనియర్ నాయకులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం డివైఎఫ్ఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఈ రాజకీయ శిక్షణా తరగతులు స్థానిక జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం జక్కా వెంకయ్య మెమోరియల్ హాల్ నందు ఈనెల 1.2 తేదీలలో నిర్వహించనున్నారు. రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభ సూచికంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.పి నరసింహా జెండా ఆవిష్కరణ గావించారు. ఈ క్లాసులకు జిల్లా నలుమూలల నుండి 150 మంది కార్యకర్తలు హాజరైయ్యారు. మొదటి క్లాసు మానవ సమాజ పరిణామం, మధ్యాహ్నం నుండి శాస్త్రీయ ఆలోచన క్లాసులు నిర్వహించారు. రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభోత్సవానికి ముందుగా డివైఎఫ్ఐ సీనియర్ నాయకులు మాట్లాడుతూ గతంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి నిర్వహించిన పోరాటాలు సాధించిన విజయాలను వివరించారు. ఆ ఉద్యమాలను, పోరాటాలను స్పూర్తిగా తీసుకోని ప్రస్తుతం యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. ముఖ్యంగా మద్యానికి యువత బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, జిల్లా వ్యాప్తంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మద్యపాన సేవనం వల్ల కలిగే అనర్ధాలను యువతకు వివరించి చైతన్యపరిచే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందేందుకు చేస్తున్న కుటిల ప్రయత్నాలను యువతకు వివరించి వారిని చైతన్య పరిచి కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. డివైఎఫ్ఐ నాయకులు ఎం.వి.రమణ పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

తగ్గిన మామిడి ధరలు

వర్షాలతో స్తంభించిన మార్కెట్ -నష్టాల ఊబిలో కౌలు రైతులు

ప్రజాశక్తి-కందుకూరు

మామిడికాయల ధరలు పతనమయ్యాయి. వారం రోజులుగా ధరలు రోజురోజుకు దిగజారుతున్నాయి. మధుర ఫలమైన బంగినపల్లి మామిళ్ల ధరలు టన్నుకు 30 వేల నుంచి 35 వేల రూపాయలు మాత్రమే పలుకుతున్నాయి. వారం రోజులకు పైగా వరుస పెట్టి కురుస్తున్న వర్షాల దెబ్బ ఇది. కందుకూరు నియోజకవర్గంలో దాదాపు 15 వేల ఎకరాలలో మామిడి తోటలు ఉన్నాయి. వీటిలో 95శాతం తోటల పలసాయాన్ని రైతుల నుంచి కౌలు వ్యాపారులు ముందుగానే కొనుగోలు చేస్తారు. ఈసారి మామిడి పూతలు దండిగానే పూసినప్పటికీ ఆలస్యంగా వచ్చాయి. దీంతో తామర పురుగు పెచ్చరిల్లింది. పూతల్లో పిందెల పడకుండానే అత్యధిక తోటలు దెబ్బతిన్నాయి. కాపు తగ్గటంతో మంచి ధరలు పలికితే గట్టెక్కవచ్చునని కౌవులు వ్యాపారాలు భావించారు. మే నెల రెండవ వారం వరకు ధరలు బాగానే పలికాయి. బంగినపల్లి కాయలు టన్నుకు నలభై వేల నుంచి 50 వేల రూపాయలు వరకు కొనుగోలు చేశారు. ఆ తర్వాత ఎడాపెడా వర్షాలు వస్తుండడంతో ఎగుమతులు తగ్గాయి. బంగినపల్లి కాయలు చెట్ల మీదనే పండి నేల రాలడంతో కొనుగోలు దారులు పెద్దగా రాకపోవడంతో కౌవుల వ్యాపారులు పండిరాలిన కాయలను చిల్లర మార్కెట్లో విక్రయిస్తున్నారు. చిల్లర మార్కెట్లో బంగినపల్లి ధర కిలోకి 30రూపాయలకి మించి రావడం లేదు. బంగినపల్లి తోపాటు ఇతర రకాల మామిళ్ళ ధరలు కూడా పడిపోయాయి. బెంగుళూరా మామిళ్ళ ధర టన్ను పదివేలకు మించి పలకటం లేదు. చిన్న రసాలు ధర టన్నుకు 30000 రూపాయలు లోపేవుంది. పెద్ద రసాల మామిళ్ళను కొనుగోలుచేసే వ్యా పారులు పెద్దగా కనిపించడం లేదు. దీంతో కౌవుల వ్యాపారులు లబోదిబోమంటూ అల్లాడుతున్నారు.

మలేరియా నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరుప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ మలేరియా నివారణ,నియంత్రణ , నిర్మూలన కోసం నిబద్ధతతో పనిచేస్తుందని అందుకు ప్రజల సహకారం పూర్తిగా అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టరు వి.సుజాత పిలుపు నిచ్చారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్క రించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖఅధికారిణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి సంతపేట గుప్తా పార్కు వరకు మలేరియా నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహన సమావేశాన్ని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం అండ్‌హెచ్‌ఒ మాట్లాడారు. మానవహారం మలేరియా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఎస్కె ఖాదర్ వలీ , మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు, జిల్లా పి ఎం పి యూనియన్ నాయకులు పి.ఎం.పి డాక్టర్లు,మలేరియా సిబ్బంది, ఫైలేరియా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి -గుడ్లూరు : విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే చదువును ఒక సాధనంగా మలుచుకుని అనుకున్నది సాధించాలని సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ అన్నారు గుడ్లూరు అభ్యుదయ పాఠశాలలో ఏర్పాటుచేసిన 10వ తరగతిలో 500 మార్కులుకి పైగా సాధించిన మండలంలోని అన్ని పాఠశాల విద్యార్థులకు అభినందన సభ కు ముఖ్య అతిధిగా హాజరైన సబ్ కలెక్టర్ ఆదివారం మాట్లాడారు. పదో తరగతిలో తక్కువ మార్కులు వచ్చిన వారు కూడా పట్టుదలతో చదివి ఇంటర్మీడియట్ అనంతరం అనేక రంగాల్లో ఉన్న అవకాశాల్ని అందిపుచ్చుకోవడానికి ప్రయత్నం చేయాలని సబ్ కలెక్టర్ తెలిపారు. ఆసక్తి ఉన్న రంగాలపై పట్టు సాధించేందుకు ప్రతి విద్యార్థి ప్రయత్నం చేయాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కలగారెడ్డి అధ్యక్షత వహించారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ప్రతి విద్యార్థిని విద్యార్థులకు సబ్ కలెక్టర్ శ్రీ పూజ చేతుల మీదుగా నేను డోలు బహుమతులు అందజేశారు. యశ్వంత్ సాయి తేజ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు అజయ్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పదో తరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రీ పూజ

ప్రజలపై భారాలు సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు :కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలపై అనేక రూపాల్లో భారాలను మోపుతున్నదని సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ పేర్కొన్నారు.ఆదివారం ఆయన పొదలకూరులోని సిపిఎం కార్యాల యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి ప్రజాధనాన్ని ప్రభుత్వ భూములను పరిశ్రమల పేరుతో బడా పెట్టుబడి దారులకు ఉచితంగా, కారు చౌకగా కట్టబెడు తున్నారని దీనిని వ్యతిరేకించాల్సిన అవసరముందన్నారు. పొదలకూరు రాపూరు సైదాపురం మండలాల్లో పార్టీని విస్తరించుకునేందుకు ఈ సమావేశానికి హాజరైన అందరూ బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పార్టీ ఆర్గనైజర్ అల్లాడి గోపాల్, మండల నాయకులు గుడిమణి రంగయ్యలు మాట్లాడుతూ అటవీ సంపదను, పోర్టులను విమానాశ్రయాలను రైల్వేలను ఆఖరు రక్షణ రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు కేంద్రం కట్టబెడుతుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో జూలై 9 వ తేదీన జరిగే సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్

సివిల్ సర్వీస్ ర్యాంకర్‌కు అభినందనలు

ప్రజాశక్తి -కందుకూరు :ఒంగోలులోని బందావనం కళ్యాణ మండపంలో పేర్నమిట్ట గ్రామస్తులు, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ వారు సివిల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో 2024లో 225వ ర్యాంకు సాధించిన కందుకూరు పట్టణానికి చెందిన వడ్లమూడి చెంచు నారాయణ మనవడు అన్ను కౌశిక్ నరసింహంకు ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, సంతనూతలపాడు ఎంఎల్‌ఎ బిఎన్ విజయ్ కుమార్‌కలిసి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గారు పాల్గొని ర్యాంక్ సాధించిన అన్ను కౌశిక్ నరసింహ ను అభినందించారు. కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, పిడికిడి వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

ప్రజాశక్తి -కందుకూరు :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని ఎఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్.కె జలాని ఖాన్ పిలుపునిచ్చారు. ఎఐటీయూసీ కందుకూరు నియోజకవర్గం 9వ మహాసభ డాక్టర్ కోటారెడ్డిభవన్లో ఆదివారం ఏఐటీయూసీ అధ్యక్షులు కే మురళి కష్ణ అధ్యక్షతన జరిగింది.జిల్లాని ఖాన్ మాట్లాడుతూ దేశంలో నేడు విభజించు పాలించే విధానం నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తుందని విమర్శించారు. కార్మిక శ్రేయస్సు కోసం కార్మికులు పోరాడు సాధించుకున్న చట్టాలను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆయన దుయ్యబట్టారు. ఎస్ టి యు రాష్ట్ర మాజీ నాయకులు పి మాలకొండయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు మాట్లాడారు. ఏఐటియుసి నియోజకవర్గం గౌరవ అధ్యక్షులు పి బాలకోటయ్య, ఎస్కె హుస్సేన్, వై ఆనంద్ మోహన్, ఎన్ రామారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 21 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటియుసి నియోజకవర్గ గౌరవ అధ్యక్షులుగా బి సురేష్ బాబు, అధ్యక్షులుగా మురళీకష్ణ, ఉపాధ్యక్షులుగా ఎన్ రామారావు, బి బాల బ్రహ్మాచారి, వై వెంకటరత్నం, కెపి జాన్సన్, ప్రధాన కార్యదర్శిగా వై ఆనందమోహన్, సహాయ కార్యదర్శిగా కే రమణమ్మ, జే రవి ,ఎం ఎస్ ఎన్ రాజు, కోశాధికారిగా ఎన్ నరసయ్యలను ఎన్నుకున్నారు.

ఎండియు వాహనాలను కొనసాగించాలి : ఐద్వా

ప్రజాశక్తి-కావలి

ఎప్పటిలాగే రేషన్ సరుకులను ఎండియు వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే కొనసాగించాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. వైకుంఠపురంలోని 36వ డివిజన్ లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు టి.శివకుమారి, కార్యదర్శి షేక్ మస్తాన్‌బీలు మాట్లాడుతూ 36వ డివిజన్ పరిధిలో రెండు రోజుల ఒకసారి మంచి నీటి సరఫరా చేస్తున్నారని మహిళలు తెలియజేశారని, అదేవిధంగా మంచినీటి బోర్లు రిపేరై ఉన్నాయని అవి రీపేరు చేయించాలని, మంచినీటిని రోజు రెండు పూటలా సరఫరా చేయాలని కోరారు. అదేవిధంగా రేషన్ సరుకులను రేషన్ బండ్లు ప్రతినెలా వారి ఇళ్ల వద్దకు వచ్చి సరుకులు ఇస్తున్నారని, ఈరోజు నుండి రేషన్ షాపుల ద్వారా సరుకులు తీసుకోవాలని అధికార పార్టీలు చెబుతున్నారని, దానిమూలంగా మహిళలకు ఇబ్బందికరంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజువారి పనులు చేసుకునే వాళ్ళు షాపులు ఎక్కడో దూరంగా పెడితే వెళ్లి తెచ్చుకోవడానికి బియ్యం బస్తాలను దూరం నుండిమోసుకు రావాలన్నా ఇబ్బందులన్నారు. పనులు మానుకొని రేషన్ షాపులకు వెళ్లాలంటే ఒక రోజు కూలి పోతుందన్నారు. గతంలో లాగానే రేషన్ బండ్లను ఇంటి వద్దకు పంపించి ఇచ్చే విధంగానే అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రేషన్ బండ్లు ఇళ్ల వద్దకు వస్తే, వారు ఉదయం లేదా సాయంత్రం ఐదు గంటల తరువాత వస్తున్నారని. అందుకని ఆ సమయంలో అయితే రేషన్ సరుకులను ఇళ్ల దగ్గరే తీసుకోవడానికి అనుకూలంగా ఉండేదని వారు కోరారు. వైకుంఠపురంలోని 36వ డివిజన్ చెరువు సంఘం, గిరిజన కాలనీ మహిళలతో 11మందితో మహిళా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మల్లీశ్వరి, కార్యదర్శిగా మడపల్లి శైలజ, ఉపాధ్యక్షురాలిగా తన్నీరు స్వర్ణ, సహాయక కార్యదర్శిగా మేడ విజయలక్ష్మిని ఆఫీస్ బేరర్స్‌గా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, పట్టణ కమిటీ సభ్యులు మడపల్లి రమణయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఎంపిడిఒ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా డిప్యూటీ ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న నాగూర్‌వల్లీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఎంపిడిఒగా ఉన్న జి.వేణుగోపాలరావు శనివారం ఉద్యోగం విరమణ చేయడంతో నాగూర్ వల్లీని ఎంపిడిఒగా నియమిస్తూ జెడ్‌పి సిఇఒ నుంచి ఉత్తర్వులు అందాయి.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు గ్రామంలో బుద్ధి పద్మావతి కళ్యాణ మండపంలో దేవాంగ సంఘ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులకు సన్మాన కార్యక్రమం చేపట్టిన దేవాంగ సంఘ పెద్దలను ఆమె అభినందించారు. చదువులో అంకితభావం, నిరంతరశ్రమ ఫలితంగానే విద్యార్థినీ, విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే దిశగా దేవాంగ సంఘ పెద్దలు నిర్వహిస్తున్న ఈ సన్మాన కార్యక్రమం ఇతర కుల సంఘాలు స్ఫూర్తిగా తీసుకొని మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. తహశీల్దారు నిర్మలానంద బాబా, దేవాంగ సంఘ పెద్దలు పిచ్చుక మధు సూధన్ రావు, 12వ వార్డు మెంబర్ పిచ్చుక కృష్ణవేణి, మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఇంతా మల్లారెడ్డి పాల్గొన్నారు.

శశిధర్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-నెల్లూరు : తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ ప్యారిస్ లాంగ్వేజ్ అండ్ లింగ్విస్టిక్స్ పరిశోధకులు కె.శశిధర్‌కు యూనివర్సిటీ డాక్టర్ రేటును ప్రకటించింది. ఇంపాక్ట్ ఆఫ్ డిఫరెంట్ ఏటేడ్ ఇన్‌స్ట్రక్షన్ అండ్ అసెస్మెంట్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ లెర్నర్స్ ఇన్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ ఎ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ఎస్వీ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ బి.రాజమాణిక్యం తెలిపారు. ఈ పరిశోధన ఎస్.వి.యు. ఆర్ట్ విభాగంలోని లింగ్విస్టిక్ హెడ్, చైర్‌పర్సన్ ప్రొఫెసర్ డాక్టర్ జి అరుణ పర్యవేక్షణలో శశిధర్ తన పిహెచ్‌డి పరిశోధన పూర్తి చేశారు.

మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ హుస్సేనమ్మ

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-నెల్లూరు

భావితరాలకు మలేరియా రహిత సమాజాన్ని అందజేద్దామని జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ హుస్సేనమ్మ వ్యాఖ్యానించారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కీటక జనిత వ్యాధుల భారిన పడేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వ్యాధుల భారిన పడే అవకాశాలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీ వరకు మలేరియా నివారణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో మలేరియా వ్యాధికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పొరపాటున వ్యాధికి గురైతే నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో ఆమె మాటల్లోనే ...

ప్రశ్న. మలేరియా వ్యాధికి గురికాకుండా ఉండేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏదైనా కారణాలచేత ఈ వ్యాధి బారిన పడితే తీసుకోవాల్సిన చికిత్స విధానం ఏమిటీ ..?

జవాబు. మలేరియా వ్యాధి ప్లాస్మోడియం సంతతికి చెందిన (ఎనాఫిలిస్ దోమ) పరాన్నజీవుల ద్వారా మనిషికి సంక్రమిస్తుంది. ఆడ దోమ గుడ్లు పెట్టే సమయంలో మానవుని కుట్టిన సందర్భంలో మలేరియా వ్యాధికి కారణమైన పరాన్నజీవిని శరీరంలోకి వదులుతుంది. ఈ పరాన్న జీవి మానవుని శరీరంలోకి ప్రవేశించిన 8 నుంచి 30 రోజులల్లో జ్వరం వస్తుంది. తలనొప్పి, వాంతులు, విరోచనాలు, దగ్గ ప్రధానమైన లక్షణాలుగా కనిపిస్తాయి. ఒకొక్కసారి శ్వాస తీసుకోవడం ఇబ్బంది కరంగా ఉంటుంది, రక్తస్రావం, కామెర్లు, తీవ్రమైన అలసట, మూర్ఛ వంటివి తీవ్రమైన లక్షణాలుగా దర్శనమిస్తాయి. ఈ వ్యాధి నుంచి రక్షణ పొందాలంటే ఏకైక మార్గం దోమతెరలు వాడటం. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వాస్తవానికి దోమలు పుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధిని నివారించడం సులువు.ఈ వ్యాధి బారిన పడిన వారు యాంటీ మలేరియల్ ఔషధాన్ని వైద్యుని సలహాలు సూచనల మేరకు తీసుకోవాలి.

ప్రశ్న. సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. జిల్లాలో డెంగీ వ్యాధితో ఎంత మంది చికిత్సలు తీసుకున్నారు. మరణాలు ఏమైనా సంభవించాయా..?

జవాబు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమం నిర్వహించాలని పిలుపు నిచ్చింది. ఈ కార్యక్రమంలో మలేరియా, డెంగీ వ్యాధులను ఏ విధంగా అరికట్టాలి. ఈ వ్యాధులకు గురికాకుండా ఉండేందుకు ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఈ సదస్సులు ప్రధానంగా తీసుకొని నగర, రూరల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. బిసి వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్‌కు చెందిన ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాం. ఆశాలు, ఎఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు, సూపర్‌వైజర్ల సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 2023వ సంవత్సరంలో మలేరియా కేసులు 4 నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 3 కేసులు నమోదు అయ్యాయి. 2023లో డెంగ్యూ కేసులు 116 నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 58 కేసులు నమోదయ్యాయి. ఎటువంటి మరణాలు నమోదు కాలేదు.

ప్రశ్న. డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఎన్ని సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ఎంతమంది నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు..?

జవాబు. డెంగీ కేసుల నిర్ధారణ పరీక్షలు నగరంలోని జిజిహెచ్, కావలి ఏరియా వైద్యశాల, కందుకూరు ప్రభుత్వ వైద్యశాల, ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రభుత్వం సెంటర్లను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్లలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతోపాటు వైద్యచికిత్సలు అందజేస్తారు. జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఇప్పటి వరకు 4275 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి డెంగీ నిర్ధారణ పరీక్షలు చేపట్టాం. వీరిలో కేవలం 58మందికి మాత్రమే నిర్ధారణ అయింది. వీరికి చికిత్సలు అంద జేసి పూర్తి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాం. నగర శివారు ప్రాంతాల్లో ఈ డెంగీ కేసులు నమోదు అవుతున్నాయి. ఏయే ప్రాంతాల్లో అయితే ఈ కేసులు నమోదవుతున్నాయో ఆయా ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా డెంగీ వ్యాధి నిర్మూలనకు వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తల సమిష్టి సహకారంతో రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నాం. డెంగీ పాజిటివ్ కేసు నమోదైన ప్రాంతానికి చుట్టుపక్కల ఉన్న నివాసాల్లో సుమారు 50 రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నాం.

ప్రశ్న. ఈ సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు.. దోమ తెరలు ఏయే ప్రాంతాల్లో పంపిణీ చేశారు..?

జవాబు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వారంలో ఒక రోజు తప్పని సరిగా డ్రైడే కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇంటింటి సర్వే నిర్వహించడంతోపాటు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం, స్ప్రే కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. గ్రూప్ సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. హైరిస్క్ కలిగిన ప్రాంతాలైన రాపూరు, దోమతెరల పంపిణీ చేశాం. జిల్లాలో ఏయే ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉంటుందో వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు దోమ గుడ్లు, ల్యార్వాలను నాశనం చేసేందుకు మత్స్యశాఖ అధికారుల సహాయంతో గంబూజియా చేపలను వదిలిపెట్టడం జరిగింది.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

చంద్రబాబు మోసపూరిత హామీలను ఎండగడుతూ జూన్ 4వ తేదీన నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైసిపి నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాలతో ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏడాది పాలనలో ఓటు వేసిన ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్య పెట్టారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం, వారిని ఆస్తులను ధ్వంసం చేయడమే తప్పా అభివృద్ధి దిశగా అడుగులు వేయలేదన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన ఒక్క సంవత్సరంలోపే ప్రజలకు మేనిఫెస్టోలో చెప్పిన హామీలను 90శాతం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారని, సంక్షేమాన్ని, అభివృద్ధి ప్రజలకు చూపించారని, కూటమి ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు జూన్ 4వ తేదీన ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ఉదయం 10 గంటలకు జరిగే వెన్నుపోటు దినం నిరసన ర్యాలీని అందరూ నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. వైసిపి రాష్ట్ర మున్సిపల్ విభాగ కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, మండల కన్వీనర్లు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, చెన్ను వెంకటేశ్వర్‌రెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, రాష్ట్ర ఎస్‌సిసెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, జిల్లా యాక్టివిస్ట్ సెక్రటరి పులిమి రమేష్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు ముతీవర్, ఏ కోటిరెడ్డి, నోటి వినయ్ కుమార్ రెడ్డి, సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, సయ్యద్ జమీర్ బాషా, షేక్ పర్వీన్, సుబ్రహ్మణ్యం రెడ్డి, కల్పన, హేమ, కవిత, పాలేటి వెంగళరెడ్డి, జమ్రు, వినోద్, కలాం, గోవర్ధన్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న గుంజి దయాకర్

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో మండల వడ్డెర వృత్తిదారులు సంఘం సమావేశం ఆదివారం జరిగినది. ఈ సమావేశానికి ప్రముఖ న్యాయవాది, ఎపి వడ్డెర వృత్తిదాల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జూన్ చివరి వారంలో నెల్లూరు నగరంలో జరిగే ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వడ్డెర వృత్తిదారులు వడ్డెరలు అందరూ ఐక్యంగా, ఒకే తాటిపై నిలబడి సమస్యలపై పోరాటం చేసి పరిష్కరించుకోవాలని కోరారు. వడ్డెర సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్ కు వెయ్యి కోట్లు నిధులు కేటాయించి కార్పొరేషన్ విధి విధానాలను ప్రకటించి కార్పొరేషన్ ద్వారా వడ్డెర్లకు 90శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలను అందించి వృత్తిదారుల సంక్షేమానికి తోడ్పడాలని కోరారు. రాష్ట్రంలో నిత్యం ఏదోక ప్రాంతంలో వడ్డెర మహిళలపై చిన్నారులపై వృత్తిదారులపై భూస్వాములు అగ్రకులాల వాళ్ళు, అల్లరి మూక అత్యాచారాలు, అగత్యాలు, దౌర్జన్యాలు హత్యలు చేస్తున్నారని వీటిని అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకొచ్చి వడ్డెర్లకు రక్షణ కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సభలలో వడ్డెర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులుగా దేవల్ల వెంకటరమణయ్య, బత్తల రత్నయ్య, కోశాధికారిగా వేముల శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా బత్తల చిన్న తిరుపాలు, సహాయ కార్యదర్శిగా కోటకొండ రామయ్య, గౌరవాధ్యక్షుడుగా కోటకొండ హాజరత్తయ్య, గౌరవ సలహాదారులుగా బత్తల పెద్ద హాజరత్తయ్య, కమిటీ సభ్యులుగా బత్తల విజయకుమార్, దేవల్ల వెంకటరమణయ్య, బత్తల రాజేష్, బత్తల పెద్దతిరుపాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సిపిఐలో చేరికలు

ప్రజాశక్తి-నగరం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఆదివారం పలువురు యువత చేరారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పర్యవేక్షణలో, స్థానిక సంతపేటలోని సిపిఐ కార్యాలయం లో ఈ చేరిక కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ మారం సుధాకర్, పి.లీలామోహన్, దుడ్డు రమేష్ బాబు, మునిశ్చంద్ర, రషీద్, లక్ష్మయ్యలతో పాటు పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లా డుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలని కోరారు. పార్టీలో నూతనోత్సాహంతో పని చేయాలని కోరారు. దేశ సమగ్రతను కాపాడుటలో మీరందరూ భాగస్వామ్యులు కావాలని కోరా రు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయ కులు మున్నా తదితరులున్నారు.

జక్కా వెంకయ్యకు ఘన నివాళులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

పేద, బడుగు, బలహీన వర్గాల ప్రతినిధిగా జనాలు గుండెల్లో కొలువైన జననేత సిపిఎం సీనియర్ నేత జక్కా వెంకయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. ఆదివారం పెనుబల్లి గ్రామంలో ఆయన 7వవ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి కృషి చేశారని, ఆయన స్ఫూర్తితో నెల్లూరు జిల్లాలో గ్రామగ్రామాన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి జక్కా వెంకయ్య ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన దళితవాడలలో అనేక కాలనీల నిర్మాణానికి అనేక పోరాటాలు చేసి సాధించారన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం జరిగిన మతకలహాలు ఈ జిల్లాలో జరగకుండా నివారించడం కృషి చేశారన్నారు. జిల్లా కమిటీ సభ్యులు ముత్యాల గురునాథం మాట్లాడుతూ ఆయన కృషి పెనుబల్లి గ్రామంలో వల్ల 300 కుటుంబాల దళితులకు ఇంటి స్థలాలు, పక్కా గృహాలు వచ్చేయన్నారు. ఆయన భూసామతో భూపోరాటాలు భూమి లేని పేదలకు భూమి పంచారన్నారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా చేసుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సిపిఎం సీనియర్ నేత చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ ఆయన చనిపోయేంత వరకు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ప్రముఖ న్యాయవాది జక్కా శేషమ్మ మాట్లాడుతూ తన యావదాస్తిని పార్టీ నిర్మాణానికి, అభివృద్ధికి ఖర్చు చేశారన్నారు. అనారోగ్యంతో నెల్లూరులో బొల్లినేని వైద్యశాలలో ఉన్నప్పుడు ఆయన కోసం పార్టీ కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి వైద్యశాల ముందు ఆయన ఆరోగ్యం కోసం రోజుల తరబడి అక్కడే ఉన్నారని తెలిపారు. ఆయన గుండె సంబంధిత వ్యాధికి చికిత్స చేయించుకుని అనంతరం 14 సంవత్సరాల పాటు తిరిగి పార్టీ పని చేస్తూ చనిపోయే వరకు ఉన్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మూలిగ వెంకయ్య, గండవరపు శేషయ్య, డాక్టర్ రాజేశ్వరరావు, చల్లకొలుసు మల్లికార్జున, నన్నం మాధవ్, బాబు, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల వద్ద సరుకులు పంపిణీ

కావలిలో సరుకులు అందజేస్తున్న ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి : నాణ్యమైన నిత్యావసర వస్తువులు రేషన్ షాపుల ద్వారా ఇవ్వాలనే లక్ష్యంతోనే రేషన్ షాపులను పున:ప్రారంభించినట్టు ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక వైకుంఠపురంలోని 29వ రేషన్‌షాపు వద్ద లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను ఎంఎల్ఎ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మొబైల్ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పక్కదారి పట్టాయని తెలిపారు. లబ్ధిదారుల వద్దసమయానికి డబ్బులు లేకపోతే సరకులు తీసుకోవడం ఇబ్బందిగా ఉండేదని, పనులు మానుకొని సరకులు తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం 15 రోజుల పాటు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంట నుంచి రాత్రి 8 గంటల వరకు కూడా షాపులు తెరిచే ఉంటాయని తెలిపారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు ఇంటి వద్దకే డీలర్లు సరకులు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రేషన్ షాపు వద్ద బోర్డును ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రభుత్వం ఏమి సరుకులు మంజూరు చేసిందో ఆ బోర్డులో పేర్కొనడం జరుగుతుంద న్నారు. రేషన్‌షాపుల ద్వారా చిరు ధాన్యాలను కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరంగా ఉండాలంటే చిరు ధాన్యాలు అవసరమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం, ప్రజల అభ్యున్నతి కోసం, పేద బడుగు, బలహీన వర్గాల కోసం, ఆరోగ్యవంతమైన సమాజం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్డు ఉన్న వ్యక్తులు ప్రత్యక్షంగా కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు వచ్చి రేషన్‌షాప్ నుండి సరకులు తీసుకెళ్లాలని కోరారు. ఇది మంచి ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం ఎప్పుడు కూడా ప్రజల పక్షాన నిలిచేప్రభుత్వమని, ప్రజల కోసం ఆలోచించే ప్రభుత్వమని, ఈ మంచి ప్రభుత్వాన్ని మనందరం ఆశీర్వదిద్దామన్నారు. తహశీల్దార్ జి.శ్రావణ కుమార్, సిఎస్‌డిటి విజయమ్మ, కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పోతుగంటి అలేఖ్య, తటవర్తి వాసు, మంచాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రేషన్ షాపుల్లో ఆదివారం సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రారంభించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, యువత నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్, షేక్ సర్దార్, బుజ్జిరెడ్డి, నలిశెట్టి సీనయ్య, వెంకటేశ్వర్లు, తోడేటి వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు



: స్థానిక చౌకదుకాణం ద్వారా నిత్యావసర సరుకులను నియోజక వర్గ తెలుగు యువత నాయకులు ముప్పాళ్ళ వెంకట్ చౌదరి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలనలో నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలు జరిగాయని, కూటమి ప్రభుత్వంలో అలాంటివి జరుగకుండా చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ షాపుల్లో ఉదయం 8గంటలు నుండి మధ్యాహ్నం 12గంటలు వరకు మరల సాయంత్రం 4గంటలు నుండి రాత్రి 8గంటలు వరకు డీలర్లు చౌక దుకాణాల్లో ఉండి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారన్నారు. ఈ సరుకులను 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాలెపాటి వెంకటేశ్వర్లు, గ్రామ తెలుగు యువత అధ్యక్షులు మద్దిపాటి రవీంద్ర బాబు, చెన్నకృష్ణారెడ్డి, పఠాన్ మస్తాన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దగదర్తి : ప్రతి ఒక్కరికీ రేషన్ అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పాత పద్ధతిని అమలు చేస్తుందని ఎంఎల్ఎ దగ్గుపాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. అంతేగాక వినియోగదారులకు నాణ్యమైన సరుకులు సరఫరా చేసే దిశగా దళారీ వ్యవస్థను రూపుమాపేందుకు రేషన్ మాఫియాను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం రేషన్‌షాపులు వద్దనే సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టిందని అనంతరం దగదర్తి మండలంలోని కేకేగుంట గ్రామంలో రేషన్‌షాపులో సరుకుల పంపిణీ ప్రారంభించిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో రేషన్ పంపిణీ వాహనాలను అడ్డంపెట్టుకొని రేషన్ మాఫియా చెలరేగిపోయిందన్నారు. నాణ్యమైన బియ్యాన్ని వ్యాపారులకు తరలించి నాసిరకం బియ్యాన్ని పేదలకు పంపిణీ చేశారని తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, బీద గిరి, గున్నం హరి కిషోర్ రెడ్డి, తహశీల్దార్ పి.కృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, విఆర్ఒ బాలనాగమ్మ, టిడిపి నాయకులు అంబటి రమేషు, జలదంకి శ్రీహరి, తాళ్లూరు సుధాకర్, పులి సీనయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : పేద ప్రజలకు రేషన్ బియ్యం పంపిణీ చేసే విధానంలో మార్పులు జరిగాయని తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రేబాల పంచాయతీ నెహ్రూ నగర్ కాలనీలో రేషన్ దుకాణాల వద్ద రేషన్ బియ్యాన్ని అందించే కార్యక్రమంలో ఆదివారం తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు పాల్గొనగా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టిడిపి సీనియర్ నాయకులు ఏటూరి శివరామ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్ లగుంతోటి భాగ్యలక్ష్మి, సివిల్ సప్లై అధికారులు, టిడిపి నాయకులు మస్తానయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో ఉన్న తొమ్మిదవ నెంబర్ ప్రభుత్వ రేషన్ దుకాణాన్ని, బోగోలు పంచాయతీ మార్కెట్లో ఉన్న ఒకటో నెంబర్ ప్రభుత్వ రేషన్ దుకాణాన్ని ఆదివారం తహశీల్దార్ సురేష్ బాబు ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను స్టాక్ పరిశీలించి తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులతో మాట్లాడారు. రేషన్ డీలర్ సుబ్బారెడ్డికి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, తహశీల్దార్ సురేష్‌బాబు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. మండల టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రజాశకి-సంగం : మండలంలో రేషన్ దుకాణాలను తహశీల్దార్ సోమ్లా నాయక్, టిడిపి మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. ఆదివారం నుండి రేషన్ దుకాణాల వద్ద పాత పద్ధతిలో సరుకుల పంపిణీ ప్రారంభమ వడంతో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులకు సరుకుల పంపిణీ తీరును పరిశీలించారు. సంగంలో రేషన్ దుకాణం వద్దనే పాత పద్ధతిలో లబ్ధిదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారుల కోసం టిడిపి ప్రభుత్వం మంచి బహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. సివిల్ సప్లై డిటి మల్లికార్జున, సంఘం సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మాఘం గిరిబాబు, టిడిపి టౌన్ అధ్యక్షులు చల్లా నాగరాజు, ముతహార్, దండే పెంచలయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి కోవూరు : ఇంటిటికీ రేషన్ సరుకుల పేరిట గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దే ఉద్దేశంతో ప్రజల కోరిక మేరకే రేషన్ షాపుల వద్దే సరుకులు పంపిణి చేసే పాత విధానాన్ని అమలులోనికి తీసుకు వచ్చామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు పంచాయతిలోని పాటూరు రోడ్డులో చౌక ధరల దుకాణాన్ని సందర్శించి సరుకుల పంపిణీ విధానాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, తహశీల్దారు నిర్మలానంద బాబా, ఎంపిడిఒ శ్రీహరి రెడ్డి, సర్పంచ్ యాకసిరి విజయమ్మ, పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, జొన్నవాడ ఆలయ సేవా కమిటి ఛైర్మన్ తిరుమూరు సుధాకర్ రెడ్డి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌకదుకాణాలను పెంచాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలో కేవలం 20 చౌకదుకాణాలు మాత్రమే ఉన్నాయని, కావును వాటిని పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం కార్యదర్శి మొగల్ నిస్సార్ అహ్మద్ పేర్కొన్నారు. మండలంలో గతంలో ఇంటింటికి రేషన్ ఎండియు వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ జరుగుతూ ఉండగా నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దుచేసి, కొత్తగా చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ వ్యవస్థకు సంబంధించి మండలంలో కేవలం 20 చౌకదుకాణాలు మాత్రమే ఉన్నాయి. ఎఎస్ పేటలో మొత్తం 19 పంచాయతీలు కలవు. ఎండియు వాహనాల ద్వారా సరుకుల పంపిణీ నిలిపివేయడం ద్వారా ఎఎస్‌పేటలోని గండువారిపల్లి గ్రామానికి, చౌట భీమవరానికి సంబంధించి తిమ్మానాయుడుపల్లి మజారా గ్రామానికి, అనుమసముద్రం గ్రామ పంచాయతీకి సంబంధించి తెల్లపాడు మజారా గ్రామానికి, పెద్దబ్బీపురం గ్రామానికి సంబంధించి మజారా గ్రామమైన చిన్న అబ్బీపురం తదితర గ్రామ ప్రజలకు సుదూర ప్రాంతాలకు వెళ్లి రేషన్ తెచ్చుకునే దుర్భేద్యమైన పరిస్థితి నెలకొంటుందని, గ్రామాల్లోని ప్రజలు పత్రికాముఖంగా వాపోయారు. కావున ఈ విషయాన్ని గమనించి, ఆయా గ్రామాల్లో కొత్తగా చౌక దుకాణాలను మంజూరు చేయాలని, అదేవిధంగా బినామీలకు తావు లేకుండా రెగ్యులర్‌గా డీలర్లను ఏర్పాటు చేయాలని పత్రికాముఖంగా ఆయా గ్రామాల నాయకులు కోరుకుంటున్నారు.

పసుపు పంటకు మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి - ఉదయగిరి

పసుపు పంటను పరిశీలిస్తున్న రైతునాయకులు

మెట్టప్రాంత రైతులు జీవనాధారంగా పండించుకున్న పసుపు పంటకు కనీసం మద్దతు ధర లేక కన్నీరు మిగిచాయని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కాకు వెంకటయ్యతో స్థానిక రైతులు పంట కళ్లో ఉన్న పంటను చూపుతూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ ఎండనక వాననక రైతులు పొలాలలో పనిచేసి ప్రయివేటు వడ్డీలకు అప్పులు చేసి సంవత్సరం కాలం పండించిన పసుపు పంటకు గిట్టుబాటు ధర మద్దతు రేటు లేక అల్లాడుతున్న మెట్టప్రాంత రైతాంగానికి అధిక ప్రయివేటు వడ్డీలు పసుపు రైతుకు శాపంగా మారాయన్నారు. పాలకులు ప్రభుత్వాలు పట్టించుకునే పరిస్థితులు లేక ఒకవైపున కరువు మరోవైపున పెరిగిన పెట్టుబడులు ఎరువులు ధరలు ట్రాక్టర్ ధరలు విపరీతంగా రైతులపై భారాలు మోపుతున్న ఈ పరిస్థితులలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో క్వింటాలకు రూ.18వేలు ఉండగా వైసిపి ప్రభుత్వంలో క్వింటాల్ రూ.15వేలు నుండి రూ.16వేలు ఉండగా ప్రస్తుత రైతు ప్రభుత్వము రైతుల కోసమే నేను పుట్టాను రైతు క్షేమమే తన సంక్షేమం మీ రైతు కుటుంబాల ఆర్థికంగా ముందుకు నడవాలి అలా నడిచిన నాడే రైతే రాజు అని వ్యక్తం చెప్పే ఈ ప్రభుత్వ కాలంలో పసుపు కింటాలు రూ.9వేలకు రావడం అనేది అత్యంత శోచనీయమని మెట్టప్రాంత రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎకరాకు పెట్టుబడి రెండు లక్షల రూపాయలు అవుతున్న దిగుబడి 30 క్వింటాలు వస్తున్నాయని సంవత్సరం ఒక ఇంటికి రైతుకు కూలి కూడా రావడం లేదని ఈ పాలకులు ప్రభుత్వాలు అర్థం చేసుకొని పండించిన పసుపు రైతులకు రూ.15వేలు నుండి రూ.16వేలు వచ్చేలా ఉంటే గాని ఆ రైతు తిరిగి వ్యవసాయం చేయాలనే ఒక ఆతృత సంకల్పంతో ముందుకు పోతాడు తప్ప లేకపోతే రైతు ఆత్మహత్యలే శరణ్యం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పద్ధతిపై ప్రభుత్వాలు పాలకులు ఉన్నతాధికారులు ప్రత్యేకమైన దృష్టి పెట్టి బడ్జెట్లో రైతుకి గిట్టుబాటు ధరలకి మద్దతు ధరలకి అత్యధికంగా నిధులు కేటాయించి ఆ దిశగా రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

'ఫడ్స్'కు ఎంఎల్ఎ ఆర్థికభరోసా..

ప్రజాశక్తి - ఉదయగిరి



మే 29వ తేదీన కడప గడపలో జరిగిన మహానాడుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురైన టిడిపి క్రియాశీలక సభ్యుడు ఫడ్స రమణయ్యకు ఎంఎల్ఎ కాకర్ల సురేష్ అండదండలు ఉంటాయని ఆ కుటుంబ సభ్యులకు భరోసానిస్తూ పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారని టిడిపి మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నాయకుల సమాచారం అందుకున్న ఎంఎల్ఎ తిరుపతి ఎంఎల్ఎ పులివర్తి నానితో మాట్లాడి టిడిపి కుటుంబ సభ్యునికి అండదండలు అందించాలని కోరారన్నారు. ఆయన సహాయంతో కిమ్స్‌లో రమణయ్యకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు ఆదివారం మాజీ మండల అధ్యక్షులు బొజ్జ నర్సింలు, ఉప్పుటూరి వెంకటయ్య ఐటిడిపి అధ్యక్షులు రామ్మోహన్ యాదవ్, రోశయ్యతో కలిసి తిరుపతిలోని కిమ్స్‌లో రమణయ్యను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ఎంఎల్ఎ కాకర్ల సురేష్ తనకు ప్రాణభిక్ష పెట్టారని, ఆయన చొరవతోనే పునర్జన్మను పొందుతున్నారని సంతోషం వ్యక్తం చేశారన్నారు.